
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
3
ఆదివారం 14 జూలై 2024






ఎస్పీ శ్రీనివాసరావు (పల్నాడు జిల్లా)



ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ (గుంటూరు జిల్లా)





పాలనలో ఆధ్యాత్మికతతో పాటు ఆధునికతను జోడిస్తాను. పేదరికం లేని రాష్ట్రమే ధ్యేయం. రాష్ట్రంలో నవ్వులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం జీవితాల్లో ఆనందం నింపుతుందని అందరూ చెబుతుంటే సంతోషకరంగా ఉంది. దేశంలో ఉన్న గొప్ప సంపద కుటుంబ వ్యవస్థ. దీనిని భావితరాలకు అందించాలి. ఈ ప్రపంచాన్ని నడిపిస్తున్న శక్తి భగవంతుడే. ప్రార్థనాలయాలు ఏ మతానికి సంబంధించినవైనా ఈ భూమిపై లేకపోతే నేరాలు ఘోరాలు ఎన్నో జరిగేవి. సైంటిస్టులు, డాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు, న్యాయవ్యవస్థ ఇలా అందరూ విధులు ప్రారంభించడానికి ముందు రెండు నిమిషాలు దేవుడిని ప్రార్థిస్తారు. హరేకృష్ణ మూమెంట్, ఇస్కాన్‌లు పోటీ పడి మన సంస్కృతిని కాపాడుతున్నాయి. - ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఆధ్యాత్మికత.. ఆధునికత

- పాలనతో జీవితాలు ఆనందమయం
- ధర్మాన్ని కాపాడుతున్న ధార్మిక సంస్థలు
- అక్షయ పాత్ర, గోకుల క్షేత్ర సేవలు భేష్
- కొలనుకొండ గోకులక్షేత్రంలో సీఎం చంద్రబాబు నాయుడు

తాడేపల్లి, జూలై 13: ప్రపంచాన్ని ముందుకు నడిపించేది నమ్మకమేనని, మనకు తెలియని ఏకైక శక్తి దేవుడేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. తాడేపల్లి మండలం బైపాస్‌లోని కొలనుకొండ హరేకృష్ణ గోకుల క్షేత్రంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయ అనంత శేష స్థాపన, గర్భాలయ భూస్పర్శ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగిస్తూ ధర్మాన్ని కాపాడడానికి విశ్వాసాన్ని కలిగించే ధార్మిక సంస్థలు ఉండడం అందరి అదృష్టమన్నారు. ప్రభుత్వం తరఫున కూడా ఇలాంటి సంస్థలకు పూర్తిగా సహకరిస్తామన్నారు. ఏ కార్యక్రమాన్ని అయినా సజావుగా చేయగలమన్న నమ్మకాన్ని హరేకృష్ణ మూమెంట్ కలిగిస్తుందన్నారు. హరేకృష్ణ మూమెంట్‌తో పోటీ పడి ఇస్కాన్ కూడా కార్యక్రమాలు చేస్తుందని చెప్పారు. మధు పండిత దాస అనుకున్నది సాధిస్తారని, నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడతారని తెలిపారు. హరేకృష్ణ మూమెంట్‌లో సత్య గౌర చంద్రదాస సహా ఐఐటీలో చదివిన వారు 50 మంది ఉన్నారని తెలిపారు. ఇస్కాన్‌లో కూడా ఐఐటీ గ్రాడ్యుయేషన్ పొందిన వారు ఉన్నారన్నారు. తానెప్పుడు వేంకటేశ్వరస్వామినే నమ్ముతానని, తమ కుటుంబ ఆరాధ్య దైవం వేంకటేశ్వర స్వామి అని చెప్పారు. 2003లో తిరుపతిలో క్లైమోర్ మైన్స్ పేలినప్పుడు తనకు ప్రాణ భిక్ష పెట్టింది వేంకటేశ్వరస్వామి అని చెప్పారు.

ఆధ్యాత్మిక ఒరవడి: జస్టిస్ రమణ

అమరావతిలో నూతన ఆధ్యాత్మిక ఒరవడికి శ్రీకారం చుట్టడం శుభసంకేతమని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. ఆధ్యాత్మికతతోపాటు సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడడం ముఖ్యమన్నారు. గోకుల క్షేత్ర నిర్మాణానికి చంద్రబాబు సారథ్యంలో మార్గం సుగమమైందన్నారు. ఎవ్వరూ ఆర్థాకలితో ఉండకూడదనే అక్షయ పాత్ర ద్వారా ఇస్కాన్ అన్నదానం చేస్తుందని చెప్పారు. అక్షయపాత్ర ద్వారా గతంలో అన్న క్యాంటీన్లకు ఇస్కాన్ సంస్థ తోడ్పాటు ఇచ్చిందన్నారు. అన్న క్యాంటీన్లను త్వరలో పునరుద్ధరించడం శుభపరిణామమని చెప్పారు.

ఉత్తమ నగరంగా అమరావతి : మధు పండిత్

ప్రపంచ ఉత్తమ నగరంగా అమరావతి నిలుస్తుందని అక్షయపాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధు పండిత్ తెలిపారు. ఉత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ వెలుగొందాలన్నారు. పాండవులు నడయాడిన అమరావతిలో నవయుగ ధర్మరాజుగా చంద్రబాబు రాజధాని అమరావతి నిర్మాణం తలపెట్టారన్నారు. అమరావతిలో గోకుల క్షేత్రం ప్రాజెక్టును 150 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు.



గోకుల్ క్షేత్రంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, అక్షయపాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధు పండిత్, మంత్రి నారాయణ, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

అమరావతి.. ఆధ్యాత్మికం

హరేకృష్ణ గోకుల క్షేత్రంలో 6.5 ఎకరాల్లో వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం జరుగుతుందని 216 అడుగుల ఎత్తున్న ప్రధాన గోపురంతో వేంకటేశ్వరస్వామి, రాధాకృష్ణ దేవాలయం నిర్మిస్తున్నారని, అమరావతిలో ఇదొక ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందన్నారు. కూటమి గెలుపుతో ప్రజల్లో సంతోషం నెలకొందన్నారు. తెలుగువారు నెంబర్ వన్‌గా ఉండాలని తాను కోరుకుంటానన్నారు. ప్రపంచంలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో 30 శాతం మంది తెలుగువారు ఉండడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భూముల ధరలు పెరిగాయన్నారు. ఒక శాతం వృద్ధి రేటు పెరిగితే రాష్ట్రానికి 15 వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు.

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ

అన్న క్యాంటీన్లకు భోజన సరఫరా బాధ్యతలను గతంలో అక్షయపాత్రకు తాను అప్పగించినట్లు చంద్రబాబు చెప్పారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో 203 అన్న క్యాంటీన్లు నాడు నిర్వహించగా గత ప్రభుత్వం మూసేసిందన్నారు. త్వరలో రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. శ్రీకృష్ణ ఆలయం ఉన్న పది కిలోమీటర్ల పరిధిలో ఎవరూ ఆకలితో ఉండకూడదని లాలా ప్రభుపాద స్ఫూర్తితో అక్షయపాత్రను ప్రారంభించారన్నారు. 23 ఏళ్లలో 400 కోట్ల మందికి భోజనం పెట్టారని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో పరిశుభ్రంగా నాణ్యతతో 22 లక్షల మందికి ప్రతి రోజూ అక్షయపాత్ర ద్వారా ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పెనుమత్స శ్రీనివాసరాజు, సక్కు గ్రూప్, యలమంచిలి కృష్ణమోహన్ గ్రూప్ రూ.కోటి చొప్పున ఇస్కాన్ సంస్థకు విరాళం ప్రకటించగా చంద్రబాబు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, రాజ్యసభ సభ్యుడు రవీంద్రకుమార్, మంత్రి సవిత, మంత్రి నారాయణ, గోకుల క్షేత్ర, ఇస్కాన్ ప్రతినిధులు మధు పండిత్ దాస, సత్య గౌర చంద్రదాస, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్‌డూడి, మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వై నాగరాజు, పలువురు అధికారులు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీలు బదిలీ

- మూడు జిల్లాలకు మారారు
- బాపట్లకు గుంటూరు ఎస్పీ తుషార్‌డూడీ
- పల్నాడుకు శ్రీనివాసరావు
- గుంటూరుకు సతీష్‌కుమార్

గుంటూరు/ నరసరావుపేట, బాపట్ల జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మూడు జిల్లాలకు ఎస్పీలు మారారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఎస్పీలను నియమించారు. ఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారక తిరుమలరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 37 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేయగా వారిలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్పీలు ఉన్నారు. గుంటూరు ఎస్పీ తుషార్ డూడీని బాపట్లకు మార్చగా, ఆయన స్థానంలో ఎస్ సతీష్‌కుమార్‌ను నియమించారు. గత ఎన్నికలకు ముందు నుంచి తుషార్ డూడీ గుంటూరు ఎస్పీగా పనిచేస్తున్నారు. 2016 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సతీష్‌కుమార్ ప్రస్తుతం కాకినాడ ఎస్పీగా ఉన్నారు. ఇప్పటివరకు బాపట్ల ఎస్పీగా ఉన్న వకుల్ జిందాల్‌ను విజయనగరం ఎస్పీగా నియమించారు. ఇక పల్నాడు ఎస్పీగా కే శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయన విజయవాడ రూరల్ డీసీపీగా ఉండగా ఆయన్ను పల్నాడు జిల్లాకు మార్చారు. ఇప్పటి వరకు పల్నాడు ఎస్పీగా విధులు నిర్వహించిన మల్లికాగర్గ్‌ను విజయ నగరం జిల్లా 5వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించారు.



ఎస్పీ తుషార్ డూడీ (బాపట్ల జిల్లా)

ఇక త్వరలో డీఎస్పీలు, సీఐల వంతు

కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిగా శనివారం ఐపీఎస్‌లను బదిలీ చేసింది. ఎట్టకేలకు తాజాగా ఐపీఎస్‌ల బదిలీ ప్రక్రియ పూర్తి కాగా త్వరలో డీఎస్పీలు, ఆ తర్వాత సీఐల బదిలీలు ఉంటాయని సమాచారం. బదిలీల కోసం ఆయా అధికారులు ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుతీరి నెల రోజులు గడిచినా ఇంకా పాత సీఐలే ఆయా విధుల్లో కొనసాగుతున్నారు. దీనిపై పార్టీ కేడర్ నుంచే కాక ప్రజల నుంచి, సంబంధిత పోలీసు వర్గాల నుంచి కూడా కొంత వరకు అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఐపీఎస్‌ల బదిలీల నేపథ్యంలో ఇక అదనపు ఎస్పీలు, డీఎస్పీలను రెండు, మూడు రోజుల్లో బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత సీఐల బదిలీలు జరగనున్నాయని సమాచారం.

తుషార్‌డూడీకి రెండో పోస్టింగ్

2018 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి తుషార్‌డూడీ ఎస్పీగా తొలి పోస్టింగ్ గుంటూరు జిల్లా కాగా రెండో పోస్టింగ్ బాపట్ల జిల్లా. బాపట్ల ఎస్పీగా సుదీర్ఘకాలం పనిచేసిన వకుల్‌జిందాల్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లా ఆవిర్భావం తర్వాత వకుల్‌జిందాల్‌కు తొలిసారి ఎస్పీగా ఇక్కడే పోస్టింగ్ దక్కింది. 26 నెలలు పాటు వకుల్ జిందాల్ బాపట్ల ఎస్పీగా సేవలందించారు. అత్యంత కీలకమైన ఎన్నికల ఘట్టం కూడా ఆయన సారథ్యంలోనే ముగిసింది. వైసీపీ పాలనలో జిల్లాలు ఏర్పడ్డాక దాదాపు ప్రతి జిల్లాకు కొత్త ఎస్పీలను నియమించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే చోట విధుల్లో ఉన్న ఎస్పీలు ముగ్గురు కాగా అందులో వకుల్ ఒకరు కావడం గమనార్హం.

కాకినాడ నుంచి గుంటూరుకు..

ప్రస్తుతం కాకినాడ జిల్లా ఎస్పీగా ఉన్న సతీష్ కుమార్ గుంటూరుకు బదిలీపై రానున్నారు. తమిళనాడులోని ఈరోడ్ ప్రాంతానికి చెందిన సతీష్ కుమార్ 2016లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం 2018లో మొదటిసారిగా చింతపల్లి ఏఎస్పీగా ఏడాదిన్నర విధులు నిర్వహించారు. ఆ తర్వాత మావోయిస్టు కార్యకలాపాల అణచివేతకు సంబంధించి నర్సీపట్నం ఓఎస్డీగా 14 నెలలు, విశాఖ పరిధిలో సెబ్ ఏఎస్పీగా తొమ్మిది నెలలు, అల్లూరు సీతారామరాజు మన్యం జిల్లా ఎస్పీగా 13 నెలలు పని చేశారు. 2023 ఏప్రిల్ నుంచి కాకినాడ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఐపీఎస్‌గా సతీష్‌కుమార్ నాలుగేళ్లు మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కీలక భూమిక పోషించారు. మావోయిస్టు కార్యకలాపాలను అణచి వేసే క్రమంలో సతీష్‌కుమార్ అనేక కార్యక్రమాలను చేపట్టి విజయవంతమయ్యారు. గంజాయి పెంపకం, అక్రమ రవాణా, విక్రయాలపై కూడా ఉక్కుపాదం మోపారు.

26 నెలలు.. నలుగురు ఎస్పీలు

పల్నాడు జిల్లా ఏర్పడి 26 నెలలు అవుతుంది. అయితే ఇప్పటి వరకు జిల్లాలో ముగ్గురు ఎస్పీలు పనిచేశారు. జిల్లాకు నాలుగో ఎస్పీగా కే శ్రీనివాసరావు నియమితులయ్యారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు విజయవాడ రూరల్ డీసీపీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పల్నాడుకు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు ఎస్పీలు ఎన్నికల కమిషన్ చర్యలతో బదిలీ అయ్యారు. చిలకలూరిపేట బొప్పుడి వద్ద జరిగిన ప్రధాని మోదీ సభకు సంబంధించి భద్రతా వైఫల్యాల నేపథ్యంలో రవిశంకర్‌రెడ్డిని బదిలీ చేశారు. పోలింగ్, అ తర్వాత జిల్లాలో జరిగిన హింసాత్మక సంఘటలను పురస్కరించుకుని బిందు మాధవ్‌ను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మల్లికా గార్గ్ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించారు.

శాంతి భద్రతలపై కఠిన వైఖరి - సతీష్‌కుమార్

శాంతి భద్రతలను పరిరక్షించే విషయంలో కఠిన వైఖరి అవలంబించనున్నట్లు ఎస్పీగా నియమితులైన సతీష్‌కుమార్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరిని ఉపేక్షించేది లేదన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తానన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు.

రేపు విధుల్లో చేరే అవకాశం

ఎస్పీగా నియమితులైన సతీష్‌కుమార్ సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. అదే రోజు ఎస్పీ తుషార్‌డూడీ విధుల నుంచి రిలీవ్ కానున్నారు.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రార్ కార్యాలయం.. రాజకీయం

- కార్యాలయ మార్పు విషయంలో వివాదాలు
- టీడీపీలో రెండు వర్గాలుగా విడిపోయిన నేతలు
- సొంత భవనం ఉన్నా అద్దె భవనంలోనే కొనసాగింపు

నరసరావుపేట టౌన్, జూలై 13: నరసరావుపేటలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ రాజకీయం తిరుగుతోంది. కార్యాలయం మార్చే విషయంలో టీడీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న అద్దె భవనం నుంచి మార్చాలని.. మరో వర్గం ఇక్కడే ఉంచాలని పట్టుపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సదరు భవన యజమాని కార్యాయంలోనే టీడీపీ నేతపై పార్టీలోని మరో నేత దాడి చేయడం కాక రేపుతుంది. పట్టణ శివారు బీసీ కాలనీ వద్ద రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంతంగా నిర్మించిన భవనాన్ని 2019 జనవరిలో అప్పటి స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రారంభించారు. ఆ తర్వాత ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో కార్యాలయాన్ని కొత్త భవనంలోకి మార్చలేదు. వైసీపీ ప్రజాప్రతినిధులు, అధికారులు అండతో రిజిస్ట్రార్ కార్యాలయ భవన యజమాని, డాక్యుమెంట్ రైటర్ యోగాంజనేయశర్మ నూతన కార్యాలయంలోకి మారకుండా అడ్డుకున్నారనే ప్రచారం జరిగింది. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చాలని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. అయితే తాజాగా కూటమి అధికారంలోకి రావడం.. కార్యాలయాన్ని మార్చే విషయంలో టీడీపీలోని నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం సదరు భవన యజమానికి మద్దతు తెలియజేస్తూ కార్యాలయాన్ని అదే భవనంలో కొనసాగిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కార్యాలయ వ్యవహారం ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబుకు తలనొప్పిగా మారిందని నేతలు చెబుతున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయం యజమాని డాక్యుమెంట్ రైటర్ కావడంతో అవకతవకలకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. కార్యాలయ వివాదం పార్టీలో ఎటువైపునకు దారి తీస్తుందో చూడాలి.

మార్చాలంటే బెదిరింపులు..

రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సొంత భవనంలోకి మార్చాలని ఉద్యమిస్తుంటే గుర్తుతెలియని వ్యక్తులు చంపుతామని బెదిరిస్తున్నారని పట్టణానికి చెందిన షేక్ మహబూబ్‌సుభాని తెలిపారు. వైసీపీ ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయంతో భవన యజమాని దొంగ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టరేట్‌లో తాను వినతి పత్రం అందజేయగా సొంత భవనంలోకి కార్యాలయాన్ని మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. ఈ పరిస్థితుల్లో గుర్తుతెలియని నలుగురు ద్విచక్ర వాహనాలపై వచ్చి బెదిరించారని తెలిపారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు ఇచ్చానన్నారు.



షేక్ మహబూబ్ సుభాని



డయేరియా వ్యాప్తిని

అరికట్టేందుకు చర్యలు

- బాధితులకు మంత్రి పొంగూరి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పరామర్శ
- స్వయంగా కాల్వల్లో పూడిక తీసిన మంత్రి, ఎమ్మెల్యే

4లో..

పిడుగురాళ్ల: లెనిన్‌నగర్‌లోని మురుగుకాల్వల్లో పూడిక తీస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



గుంటూరు రూరల్ మండలంలో సాగు చేసిన పత్తి పంట

వర్షం.. హర్షం

- సమృద్ధిగా కురిసిన వర్షాలు
- సాగుకు సిద్ధమైన అన్నదాతలు
- పత్తి, వరి వైపు అధిక శాతం మొగ్గు
- పల్నాడులో ఇప్పటికే వేసిన పంటలకు ఊపిరి

గుంటూరు సిటీ, జూలై 13: వరుణుడు కరుణలేదు.. వాతావరణశాఖ చెప్పినట్లు వర్షాలు లేవు.. అదును తప్పుతోంది.. అని ఆందోళనలో ఉన్న అన్నదాతలను మురిపిస్తూ శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో కరువుతీరా వర్షం పడింది. నాన్పుడు వానతో భూమి పదునెక్కింది. దుక్కి దున్ని సిద్ధంగా ఉంచుకున్న పొలాల్లో విత్తనాలు నాటేందుకు రైతులు సిద్ధమయ్యారు. నైరుతి రుతుపవనాలు వచ్చాక కొంత వాన కురిసినప్పటికీ పదును చాలదని రైతులు ఇన్ని రోజులు సాగుకు దూరంగా ఉన్నారు. తాజాగా కురిసిన వర్షాలకు పుడమి దాహం పూర్తిగా తీరడంతో నాట్లుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం కురిసిన వాన గుంటూరు జిల్లాలోనే అధికంగా పడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పల్నాడులో గత వారం లో కొన్ని మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాలపై ప్రస్తుతం వరుణుడు కరుణించాడు. బాపట్ల జిల్లాలో కూడా పంటల సాగుకు ప్రస్తుత వర్షపాతం సరిపోతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

దుగ్గిరాలలో అత్యధికం..

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు దుగ్గిరాలలో 148.8 మి.మీ అధికశాతం వర్షపాతం నమోదైంది. గుంటూరు పశ్చిమలో 142.2, గుంటూరు తూర్పులో 136.2, తెనాలిలో 123.4, కొల్లిపరలో 115.8, చేబ్రోలులో 107, ఫిరంగిపురంలో 105, పెదకాకానిలో 103.4, వట్టిచెరుకూరులో 86.6, ప్రత్తిపాడులో 85.4, మేడికొండూరులో 80.6, పొన్నూరులో 48, పెదనందిపాడులో 42.4, తాడికొండలో 37.6, కాకుమానులో 37.2, మంగళగిరిలో 33, తుళ్లూరులో 29.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో 37.5, నూజెండ్లలో 21, పిడుగురాళ్లలో 18.5, శావల్యాపురంలో 17, నాదెండ్లలో 12, బెల్లంకొండలో 10, బాపట్ల జిల్లా అమర్తలూరులో 93.5, చెరుకుపల్లిలో 67.5, రేపల్లెలో 41.5, నిజాంపట్నం లో 38, నగరంలో 33, చీరాలలో 26.25 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు ప్రకటించారు.

అన్ని పంటలకు అనుకూలమే..

ప్రస్తుతం కురిసిన వర్షంతో అన్ని పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. భూమి పదునెక్కడంతో తాడికొండ, ప్రత్తిపాడు, పెదనందిపాడు, ఫిరంగిపురం మండలాల్లో పత్తి సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. పొన్నూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాల్లో రైతులు వరి నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. పల్నాడు జిల్లాలో ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పత్తి సాగుతో పాటు, మిరప నారుమళ్లు పోశారు. బాపట్ల జిల్లాలో వరి నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు.



అరక దున్నుతున్న రైతు

ఎట్టకేలకు 12 రైళ్లకు అదనపు జనరల్ బోగీలు

● రిజర్వుడ్ తరగతుల బోగీలపై తగ్గనున్న భారం

గుంటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లను నామమాత్రం జనరల్ బోగీలతో నడుపుతూ సాధారణ ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్న రైల్వేశాఖ ఎట్టకేలకు వాటిసంఖ్యని పెంచాలని నిర్ణయించింది. గుంటూరు మీదగా ప్రయాణించే 12 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు జనరల్ బోగీలు జతచేస్తారు. దీనివల్ల జనరల్ బోగీల్లో ప్రయాణించేవారికి కాస్త ఉపశమనం లభించనుంది. వచ్చే వారం నుంచి ఈ బోగీలను జోడించి నడపనున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. వాటిల్లో సికింద్రాబాద్-హౌరా, హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, కాకి నాడపోర్టు-భావనగర్, భావనగర్-కాకినాడపోర్టు వీక్లీఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-భువనేశ్వర్, భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-యశ్వంత్‌పూర్, యశ్వం త్‌పూర్-మచిలీపట్నం కొండవీడుఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-ధర్మవరం, ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, కాకినాడపోర్టు-ఎల్‌టీటీ(ముంబై), ఎల్‌టీటీ-కాకినాడపోర్టు ఎక్స్‌ప్రెస్‌లున్నాయి.

ప్రస్తుతం ఈ రైళ్లు కేవలం రెండు జనరల్ బోగీలతో నడుస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఒకటి ముందు, మరొకటి వెనక భాగంలో ఉంటున్నాయి. మరికొన్ని సందర్భాల్లో రెండు బోగీలూ పక్కపక్కనే ఉంటున్నాయి. దీనివల్ల ప్రయాణికులు గందరగోళానికి గురౌతున్నారు. మరోవైపు రైళ్లరద్దు కారణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని స్లీపర్‌క్లాస్, కొన్ని సందర్భాల్లో ఏసీ బోగీల్లోనూ జనరల్ టిక్కెట్‌తో ఎక్కి టీటీఈలతో ఈఎఫ్‌టీలు రాయించుకొని ప్రయాణిస్తున్నారు. దీనివల్ల ఆయా బోగీల్లో కన్‌ఫర్మ్ బెర్తుల ప్యాసింజర్లకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. కనీసం టాయ్‌లెట్స్‌కు వెళ్లలేని పరిస్థితి. దొంగతనాలు జరిగినా నేరస్తులను గుర్తించలేని పరిస్థితులు తలెత్తాయి. ఇటీవల విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మిర్యాలగూడ వద్ద మహిళ ప్రయాణికురాలిపై ఒడిస్సాకు చెందిన ప్రయాణికుడు అసభ్యకరంగా ప్రవర్తించి రైల్లో నుంచి కిందికి తోసేశాడు. ప్రమాదంలో ఇద్దరు కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు నిత్యకృత్యంగా మారాయి. దీనిపై ఇప్పటికే రైల్వేమంత్రికి ట్విట్టర్‌లో అనేక ఫిర్యాదులందాయి. దీంతో దిద్దుబాటు చర్యగా జనరల్ బోగీలను పునరుద్ధరించారు. ప్రతీ రైలులో కనీసం 4 జనరల్ బోగీలు ఉండబోతున్నాయి. వీటిల్లో రెండు ముందు, రెండు వెనక ఉండే అవకాశం ఉన్నది. వీటికి అదనంగా మహిళలు, దివ్యాంగులు, వృద్ధుల కోసం ఒక ఎస్ఎల్ఆర్ బోగీ ఉంటుంది.

డయేరియా వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు

● బాధితులకు మంత్రి నారాయణ, యరపతినేని పరామర్శ

● స్వయంగా కాల్వల్లో పూడిక తీసిన మంత్రి, ఎమ్మెల్యే



లెనిన్‌నగర్ ఆసుపత్రిలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, అధికారులు

పిడుగురాళ్ల, జూలై 13: పిడుగురాళ్ల పరిసర ప్రాంతాలలో డయేరియా వ్యాప్తిపై ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి ప్రజారోగ్యానికి నష్టం కలుగకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ అన్నారు. లెనిన్‌నగర్ ఆసుపత్రిలో డయేరియా బాధితులను పరామర్శించిన అనంతరం లెనిన్‌నగర్, మారుతీనగర్ కాలనీలలో పర్యటించి రెండు రోజుల క్రితం వున్న పారిశుధ్య స్థితిగతులు, శనివారం సాయంత్రం వున్న స్థితిని స్వయంగా మంత్రి పర్యవేక్షించారు. పలుచోట్ల కాల్వల్లో వున్న పూడికను మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు స్వయంగా తొలగించారు. మొదట డయేరియాకు కారణమైన నీరు కలుషితమైనట్లుగా గుర్తించిన బోరును పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఐదేళ్లుగా మా ప్రాంతాలను పట్టించుకోలేదు : మహిళల మొర

టీడీపీ సానుభూతిపరులకు చెందిన కాలనీ అని ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం మమ్మల్ని, మా ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రాంతాల మహిళలు మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో పారిశుధ్యం అనేది పట్టించుకోలేదని, వాటర్ ట్యాంక్‌ను ఒక్కసారి కూడా శుభ్రంచేసిన దాఖలాలు లేవన్నారు. అదేమని అడిగితే టీడీపీ వారంటూ నిందలు వేశారని మహిళలు పేర్కొన్నారు. యరపతినేని స్పందిస్తూ పారిశుధ్యానికి ఖర్చుచేయాల్సిన నిధులు కూడా నొక్కేయడం వల్ల ఇప్పుడు ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రస్తుతం డయేరియాను అదుపులోకి తెచ్చేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



లెనిన్‌నగర్ కాల్వలో పూడికతీస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

ప్రజల ఆరోగ్యానికే ప్రాధాన్యం

● అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

● అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 13: కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరి నారాయణ స్పష్టం చేశారు. శనివారం పిడుగురాళ్ల ఆర్ అండ్‌బీ బంగ్లాలో మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం మెరుగుకు అన్ని చర్యలు చేపట్టామని, సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తగా అన్ని ప్రాంతాలలో మురుగుకాల్వల్లో పూడికతీత చేపట్టడంతో పాటు పరిశుభ్రమైన నీటిని అందిస్తామన్నారు. డయేరియా ప్రబలిన లెనిన్‌నగర్, మారుతీ నగర్‌లో 8 పవర్‌బోర్లు, 36 చేతిపంపులు వున్నట్లు గుర్తించామని, వాటిల్లో నీటిశాంపిల్స్‌ను సేకరించామన్నారు. కొన్ని బోర్లలో నీటికా లుష్యం వున్నట్లు గుర్తించడం వల్ల తాత్కాలికంగా ఆ బోర్ల వాడకాన్ని అధికారులు నిలిపివేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు కూడా శనివారం ఉదయం పిడుగురాళ్లలో డయేరియా విషయంపై అధికారులతో రివ్యూ చేశారని, ఎమ్మెల్యే యరపతినేనితో కూడా ఆయన మాట్లాడారన్నారు. డయేరియాను అదుపుచేసేందుకు అన్నిచర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని, తక్షణమే రూ.10లక్షల నిధులు పారిశుధ్యానికి కేటాయించినట్లు మంత్రి వివరించారు. పిడుగురాళ్లలోని అన్ని కాల్వల్లో పూడికతీత చేపడతామని, అన్ని చేతిపంపుల్లో నీటి శాంపిల్స్‌ను తీసుకుంటున్నామన్నారు. కోనంకి గ్రామంలోనూ డయేరియా ప్రబలిందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. అన్ని ప్రాం తాలలో పారిశుధ్యం మెరుగుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సమీక్షలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, డీఎంహెచ్ఓ రవి, తహసీల్దార్ శ్యాంసుందరరాజు, యరపతినేని నిఖిల్, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కమిషనర్ గిరికుమార్, ఏఈ రాఘవేంద్ర, పలు శాఖల అధికారులు, నాయకులు వున్నారు.

పతనమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకోవాలి

● రూ.14లక్షల కోట్ల అప్పులు పెరిగాయి ● ఏపీ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి డాక్టర్ పి.వి.రమేష్



ప్రసంగిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 13: రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలంలో ఆర్థికవ్యవస్థ పతనమైందని, రూ.14లక్షల కోట్లకు అప్పులు పెరిగాయని రాష్ట్రప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ డాక్టర్ పి.వి.రమేష్ పేర్కొన్నారు. శనివారం గుంటూరులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో "ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి కార్యాచరణ" అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠికి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా డాక్టర్ పి.వి.రమేష్ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతిరోజు రూ.75కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని, మరో రూ.175కోట్లు ప్రతిరోజు అప్పులు చేసే దుస్థితికి రాష్ట్ర ఆర్థికవ్యవస్థ దిగజారిందన్నారు. గత ప్రభుత్వం చట్టబద్ధ దోపిడీ చేస్తూ మోసపూరిత వ్యాపారసంస్థగా మారిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో 80శాతం ఉద్యోగులకు ఎలాంటి పని ఉండటం లేదన్నారు. రాష్ట్రంలో రాజకీయపార్టీలు ప్రజలను కులాల ప్రాతిపదికగా విభజించి ఓట్లు పొందాలని భావిస్తున్నాయన్నారు. వ్యవసాయం, పారిశ్రామికరంగాలలో ఉత్పాదకతను పెంచి, దళారి వ్యవస్థను తొలగించాలన్నారు. మట్టి, ఇసుక, మైనింగ్ లాంటి సహజ వనరులను గత పాలకులు దోచుకుని అవినీతిని తారస్థాయికి తీసుకెళ్లారన్నారు. రాష్ట్రంలో ఒక్కశాతం జనాభా చేతిలో 44శాతం ఆస్తులు, 24శాతం ఆదాయం ఉందని, అట్టడుగున ఉన్న 50శాతం ప్రజలకు కేవలం 5 శాతం ఆస్తులే ఉన్నారన్నారు. ఇంకా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు పి.రామచంద్రరాజు, దళిత బహుజనఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, మానవతసంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, చైర్మన్ పావులూరి రమేష్, ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్, ఎం.కోటేశ్వరరావు, మేకల రవీంద్రబాబు, రమణబాబు తదితరులు ప్రసంగించారు.

భారీఎత్తున పట్టుబడిన రేషన్ బియ్యం

● పరారైన మిల్లు యజమాని



మిల్లులో పట్టుబడిన లారీ వద్ద సీఎస్‌డీటీ పద్మజ, ఆర్ఐ శివ, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ, ఇతర నాయకులు

వట్టిచెరుకూరు, జూలై 13: మండలంలోని చమళ్లమూడి గ్రామంలో గల రైస్‌మిల్లులో శనివారం పీడీఎస్ రైస్ బ్యాగుల లోడు చేసిన 10 టైర్ల లారీని టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని సివిల్ సప్లయ్, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. లారీలోని పీడీఎస్ రైస్ బ్యాగులతో పాటు మిల్లులో ఉన్న రైస్‌ను బ్యాగుల్లో నింపుతున్నారు. ఆ సమయంలో మిల్లు యజమాని గుంటూరు నగరానికి చెందిన సుబ్బారావు పరారు కాగా వట్టిచెరుకూరు సీఐ ఉదయ్‌బాబు, ఎస్సై వినోద్‌బాబు, సిబ్బంది అతన్ని పట్టుకునేందుకు గుంటూరు వైపు వెళ్లారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చమళ్లమూడి మిల్లును కొనుగోలు చేసిన సుబ్బారావు ఈ ప్రాంతంలో పీడీఎస్ రైస్‌ను సేకరించి మిల్లుకు చేర్చి ఇక్కడ నుంచే పెద్దఎత్తున రవాణా చేస్తూ పెద్ద మాఫియాగా ఎదిగాడు. అతనికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతల అండ పుష్కలంగా ఉండటంతో యథేచ్ఛగా పీడీఎస్ రైస్‌ను తరలించేవాడు. పలుమార్లు స్వల్ప మొత్తంలో పీడీఎస్ రైస్ రవాణాకి సిద్ధంగా ఉన్న సమయంలో గ్రామస్తుల సమాచారంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు చేసి రైస్ లారీలను పట్టుకొన్నారు. అయితే తుతుమంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు ఉన్నాయి. ఆ మిల్లు జోలికెళితే ఉద్యోగాలకు ఎక్కడ ముప్పు వస్తుందోనని అధికారులు, ఎక్కడ కేసులు పెట్టి వేధిస్తారోనని గ్రామస్తులు మిన్నకుండిపోయారు. గత కొద్ది రోజులుగా రైసుమిల్లుపై టీడీపీ నాయకులు నిఘా పెట్టి రవాణాకు సిద్ధంగా ఉన్న లారీలు మిల్లు ప్రాంగణంలో ఉండటంతో టీడీపీ మండల అధ్యక్షులు పూర్ణచంద్రరావు సివిల్ సప్లయ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగానికి సమాచారం ఇచ్చారు. మన్నవ పూర్ణచంద్రరావుతో పాటు, ఎస్‌సి సెల్ అధ్యక్షులు లక్ష్మయ్య, గ్రామపార్టీ అధ్యక్షులు అంకపూడి మురళి, కాట్రపాడు పార్టీ అధ్యక్షులు సాంబశివరావు, యువత అధ్యక్షులు ఎస్ నాగరాజు, మన్నవ గోపిలు ఉండగా సివిల్ సప్లయ్ డీటీ పద్మజ, ఆర్ఐ శివ, సీఐ ఉదయ్‌బాబు, ఎస్ఐ వినోద్‌బాబు, సిబ్బంది రైస్ మిల్లు వద్దనే ఉండి మిల్లులోని బావుల్లో ఉన్న బియ్యాన్ని బ్యాగులకు ఎత్తిస్తూ మొత్తం స్టాకును ఎక్కించే పనిలో పడ్డారు.

వేడుకగా ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాల ప్రదానం



ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న కళాదర్బార్ సభ్యులు, పాల్గొన్న టీడీ జనార్థన్ తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 13: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఎన్టీఆర్ 101వ జయంతి వేడుక సందర్భంగా కళాదర్బార్- అమరావతి వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులకు ఎన్టీఆర్ ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం శనివారం వేడుకగా జరిగింది. తొలుత ఏర్పాటుచేసిన సంగీత విభావరి ఆకట్టుకుంది. ఎన్టీఆర్ నటించిన పాటలను గాయనీగాయకులు శైలజ, సౌజన్య, పావని, రసూల్‌బాబు, సుధీర్‌బాబు, హరికిషన్, ప్రవీణ్‌కుమార్ ఆలపించారు. అనంతరం విచ్చేసిన అతిథులు, ప్రజాప్రతినిధులు ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, అడ్వకేట్ టీడీపీ అధికార ప్రతినిధి రామకృష్ణ ప్రసాదు, ప్రముఖ నిర్మాత ఆర్ వెంకటేశ్వరరావు, ముప్ప ప్రైవేట్ లిమిటెడ్ వెంకయ్య చౌదరి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్, డాక్టర్ సీహెచ్ అరవిందబాబులకు ఎన్టీఆర్ ప్రతిభ పురస్కారాలను అతిథుల చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పంచుమర్తి కల్పన, మేకల రవీంద్రబాబు, గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ప్రాసమణి కుమార్ వ్యవహరించారు.

ముగ్గురు అధికారులకు నోటీసులు

విచారణ అధికారిగా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ నియామకం

గుంటూరు(కార్పొరేషన్), జూలై 13: నగరపాలక సంస్థకు చెందిన ట్రావెలింగ్ బంగ్లాలో వైసీపీ ప్రచారసామగ్రి ఉంచటంపై కమిషనర్ కీర్తి చేకూరి స్పందించారు. ఎన్నికల ముందు ప్రభుత్వ కార్యాలయంలో సామగ్రి ఉంచటంపై నివేదిక ఇవ్వాలని విచారణ అధికారిగా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌ను ఆమె ఆదేశించారు. ట్రావెలింగ్ బంగ్లాలో వైసీపీ ప్రచారసామగ్రి ఉంచి విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న బంగ్లా ఇన్‌చార్జి నాగేశ్వరరావు, ఏఈ రాంబాబు, డీఈఈ రమేష్‌బాబులకు షోకాజ్ నోటీసు జారీచేశారు. కార్పొరేషన్‌కు చెందిన కొందరు అధికారులు వైసీపీ ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ ప్రచారసామగ్రిని ప్రభుత్వ కార్యాలయంలో నిల్వ ఉంచారు. దీనిపై స్పందించిన కమిషనర్ విచారణకు ఆదేశించారు.

పేరేచర్ల-ఫిరంగిపురం మధ్యన ఎల్‌సీ గేటు తాత్కాలికంగా మూసివేత

గుంటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పేరేచర్ల-ఫిరంగిపురం రైల్వేస్టేషన్ల మధ్యన ఉన్న లెవల్‌క్రాసింగ్ గేటు నెం.298కి అత్యవసర మరమ్మతుల నిమిత్తం మూసివేశామని డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు. ఈ నెల 14వ తేదీ రాత్రి 8గంటల వరకు ఈ గేటు మూసివేసి ఉంటుందన్నారు. వాహనదారులు, పాదచారులు ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

పశ్చిమ డెల్టాకు 2519 క్యూసెక్కులు

● బ్యారేజి వద్ద నీటి మట్టం 12 అడుగులు



పశ్చిమ కెనాల్ నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

తాడేపల్లి టౌన్, జూలై 13: ప్రకాశం బ్యారేజి హెడ్ రెగ్యులేటర్ నుంచి కాలువలకు శనివారం అధికారులు నీటిని విడుదల చేశారు. బ్యారేజి ఎగువన వాగుల నుండి 1000 క్యూసెక్కుల వరద నీరు, పట్టిసీమ నుండి 5300 క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోందని నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం నమోదవుతోందని, పశ్చిమ డెల్టాకు 2519 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్టు దినేష్ తెలిపారు.

సీఏ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), జూలై 13: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఏ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించారని చైర్మన్ అన్నా నందకిషోర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఏ సాయివెంకటధీరజ్ 435 మార్కులు, ఎస్.శృతిహర్షత 360, కె.బాలచందర్ 332, జె.ప్రియకుమారి 326, డి.లక్ష్మీనరసింహా 322, కె.దుర్గా 315 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ లక్ష్మీ తదితరులు అభినందించారు.



విద్యార్థులతో అన్నా నందకిషోర్ తదితరులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



శ్రీనివాస థియేటర్ వద్ద రహదారిపైకి చేరిన మురుగు

వానొచ్చిందంటే బురదొస్తాది..

- చిన్నపాటి వర్షానికే పొంగిపొర్లిన సైడు డ్రెయిన్లు
- రహదారులపైకి చేరిన బురద నీరు
- దుర్వాసనతో అల్లాడుతున్న పట్టణ వాసులు

మాచర్లటౌన్, జూన్ 13: శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మాచర్ల పట్టణంలోని పలు వార్డుల్లో సైడు డ్రెయిన్లు పొంగి పొర్లాయి. సైడు కాలువల్లోని చెత్తా చెదారం రోడ్లపైకి రావడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వార్డుల గుండా వెళ్లన్న ప్రజలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు చేయడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. పట్టణంలోని శ్రీనివాస థియేటర్, పాత వద్దిరపాలెం, పార్కు సెంటర్, బస్టాండ్ సెంటర్, ఫైర్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఈ దుస్థితి నెలకొంది. డ్రెయిన్లలో చెత్తాచెదారం నిండిపోవడం, పూడికతీత పనులు నేరుకోకపోవడంతో మురుగునీరు ప్రవహానికి అంతరాయం ఏర్పడి రోడ్లపైనే మురుగంతా పేరుకుపోయి దుర్వాసనను వెదజల్లుతోంది. పాదచారులు, వాహనచోదకులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రోడ్లపై ఏర్పడిన గోతులలో నిలిచిన మురుగు నీరు వర్షపు నీరు

సత్తెనపల్లి: వర్షాకాలంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు వర్షపు నీరు, మురుగు నీటితో జలమయంగా మారుతున్నాయి. పట్టణంలోని సుందరయ్య కాలనీ, నాగన్న కుంట, బండ లాంతర్ల సెంటర్, వెంకటపతి కాలనీ, అచ్చంపేట రోడ్డులోని కొన్ని లోతట్టు ప్రాంతాలు ఈ సీజన్‌లో ముంపుకు గురవుతున్నాయి. ఈ సీజన్‌లో వర్షపు నీరు, మురుగు నీరు రోడ్లపై ప్రవహించడంతో పారిశుధ్యం క్షీణిస్తుంది. మునిసిపల్ అధికారులు ఎన్ని కార్యక్రమాలు చేపట్టినప్పటికీ వర్షాకాలంలో ఈ సమస్య తప్పటం లేదు.



వర్షపు నీటితో నిండి పోయిన బెల్లంకొండ ప్రధాన రహదారి

బెల్లంకొండ: మండల కేంద్రం బెల్లంకొండలోని ప్రధాన కూడలి వర్షం దెబ్బకి పూర్తి అధ్వానంగా తయారైంది. రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు చేరి దుర్గంధపు వాసనను వెదజల్లుతుండటం ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పాదచారులు నడవటానికి వీలు లేకుండా గుంతలు ఏర్పడ్డాయని ప్రయాణీకులు పేర్కొంటున్నారు. అంతేగాకుండా రోడ్డుకు ఇరువైపులా షాపుల యజమానులు షాపుల వద్ద మేరువ తొలుంటతో రోడ్డు గుంతగా ఏర్పడింది. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించు కోనే నాథుడే లేడని ప్రయాణీకులు విమర్శిస్తున్నారు. ఈ రహదారి గుండా క్రోసూరు, అమరావతి, బెల్లంకొండ మండలంలోని అన్ని గ్రామాలకు రాకపోకలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

యుద్ధప్రాతిపదికన వాటర్ ట్యాంకులు శుభ్రం

దాచేపల్లి, జూలై 13: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని వాటర్ ట్యాంకులను పంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన శుభ్రం చేస్తున్నారు. శనివారం దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావు పట్టణంలోని అన్ని హోటళ్ళను పరిశీలించి తాగునీరు, ఆహార పదార్థాల శుభ్రత, నిల్వఉంచిన ఆహార పదార్థాల నాణ్యతలను పరిశీలించారు. రోజుల తరబడి ఉంచిన ఆహార పదార్థాలను పారవేయించారు. వాటర్ ట్యాంక్‌లలో నీటిని శుభ్రపరిచి శుద్ధమైన నీటిని ప్రజలకు అందజేయాలని సూచించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలియజేశారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత అవసరమని ప్రజలకు వివరించారు.



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న కమిషనర్ నారాయణరావు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముప్పాళ్ళ, జూలై 13 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన నూర్ బాషా బాజీవలి(33) నరసరావుపేటలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 4వ తేదీన సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా సేఫ్ ఫ్యాక్టరీ సమీపంలో అతని ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో బాజీవలి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం గుంటూరులోని వైద్యశాలలో చేర్పగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య పర్వీన్, ఇద్దరు ఐదు సంవత్సరాల లోపు చిన్న పిల్లలు ఉన్నారు.

పిడుగురాళ్ల సీఐ బాధ్యతల స్వీకరణ

పిడుగురాళ్ల, జూలై 13: పిడుగురాళ్ల పట్టణ సీఐగా ఎస్.వెంకటరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు స్పెషల్ బ్రాంచిలో పనిచేసిన వెంకటరావు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం పిడుగురాళ్ల సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన సీఐ పీవీ ఆంజనేయులును వీఆర్‌కు బదిలీ చేశారు. ఈసందర్భంగా సీఐ వెంకటరావు మాట్లాడుతూ శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇస్తానని, ట్రాఫిక్ కష్టాలను తొలగిస్తూ ఫ్రెండ్లీపోలీసు విధానాన్ని అమలుచేస్తున్నట్లు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.



పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్.వెంకటరావు

కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

రెంటచింతల, జూలై 13 : ప్రతీ కౌలుదారుడు గుర్తింపు కార్డులు తీసుకోవాలని అప్పుడే ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో ఏర్పడే పంట నష్టపరిహారం కౌలుదారులు పొందగలుగుతారని ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ కౌలుదారుడు భూ యజమాని అంగీకార పత్రంతో పాటు, తగిన ధ్రువీకరణ పత్రాలను అందజేసి కౌలు గుర్తింపు కార్డును పొందాలని సూచించారు. అప్పుడే కౌలుకార్డు వ్యవసాయశాఖ ద్వారా అమలయ్యే పలు పథకాలు అందుతాయన్నారు. భూ అంగీకార పత్రాల జారీతో భూ యజమానికి ఎలాంటి నష్టం ఉండదన్నారు.

సాగు, తాగు నీటికి ప్రాధాన్యం

- ఎత్తి పోతల పథకాలన్నింటికీ మరమ్మతులు చేయిస్తా
- స్నేహ హస్తాల కార్యక్రమాలు అభినందనీయం
- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అచ్చంపేట, జూలై 13 : నియోజకవర్గంలో సాగు నీరు, తాగు నీటి కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తానని ఎమ్మెల్యే భాష్యంప్రవీణ్ అన్నారు. శనివారం అచ్చంపేటలో స్నేహ హస్తాల ఫౌండేషన్ నిర్మించిన బస్ షెల్టర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం చెరుకుంపాలెంలో పలువురు లబ్ధిదారులకు కుట్టుమిషన్లను అందజేశారు. ఆయా కార్యక్రమాల సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఎత్తిపోతల పథకాలన్నింటికీ మరమ్మతులు చేయించి సాగునీరు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. బడ్జెట్ సమావేశాల అనంతరం సమస్యలపై దృష్టి సారిస్తానని తెలిపారు. స్నేహహస్తాల ఫౌండేషన్ అందించిన కుట్టుమిషన్ల ద్వారా మహిళలకు జీవనోపాధి కలుగుతుందని, అలాగే అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో నిర్మించిన బస్‌షెల్టర్ ఆనేక మందికి ఉపయోగ పడుతుందని అన్నారు. చెరుకుంపాలెంలో నవీన వ్యాన్ని ఏర్పాటు చేయించి గ్రామంలోని అన్ని సమస్యలను రాబోయే రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. చెరుకుంపాలెంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి విద్యుత్‌శాఖ మంత్రితో మాట్లాడతానన్నారు. ఈ సందర్భంగా నీళ్ళచర్లపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి స్నేహహస్తాల ఫౌండేషన్ రూ.55 వేలు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ద్వారా అందించారు. స్నేహ హస్తాల ఫౌండేషన్, సహకారంతో రూ.10 లక్షల విలువైన కుట్టు మిషన్లను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేతుల మీదుగా 100 మంది లబ్ధిదారులకు అందించారు. అచ్చంపేటలోని బస్ షెల్టర్ రూ.5 లక్షలతో నిర్మించి దానిని కూడా ప్రారంభించారు. చెరుకుంపాలెంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో 25 శాతం ఖర్చును స్నేహహస్తాల ఫౌండేషన్ భరిస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు ఫౌండేషన్ ప్రతినిధి తుమ్మా శౌరిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నంది గం ఆశీర్వాదం, చెరుకుంపాలెం గ్రామ వైస్ ప్రెసిడెంట్ పొట్ల శ్రీనివాసరావు, వెనిగండ్ల కోటయ్య, గుండం కోటేశ్వరరావు, మన్నెం భద్రయ్య, భాష్యం ప్రవీణ్, మన్నెం రాజులక్ష్మి, ఎన్ఆర్‌ఐ చెందిన వర్రే ఫౌండేషన్ ప్రతినిధి ఎం.శ్రీనివాస్, ఎన్ఆర్‌ఐ చెందిన మన్నెం రాజ్యలక్ష్మి, కొలగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో భాష్యం ప్రవీణ్‌కు ఘన స్వాగతం ..

నియోజక వర్గ శాసన సభ్యుడై భాష్యం ప్రవీణ్‌కు అచ్చంపేట మండల నేతలు భారీగా స్వాగతం పలికారు. గుర్రపు బగ్గీపై ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ముందుగా భాష్యం ప్రవీణ్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అచ్చంపేటలోని సీతారామ స్వామి వారి కళ్యాణమండపంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి కిరాణా వర్తక సంఘం వారు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను ఘనంగా సన్మానించారు.



కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్



అచ్చంపేటలో గుర్రపు బగ్గీ పై ఎమ్మెల్యే ప్రవీణ్

సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు..

- కూటమి ప్రభుత్వం ఏర్పడి 30 రోజులు పూర్తి
- చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లకు శుభాకాంక్షలు
- పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

సత్తెనపల్లి, జూలై 13: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు వెళుతుందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం సత్తెనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి 30 రోజులు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వంపై విమర్శలు చేసే వారికి ప్రజలే తగినవిధంగా గుణపాఠం చెబుతారన్నారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో మంత్రివర్గం ప్రజలకు ఉపయోగపడే పథకాలపై దృష్టి సారించి వేగంగా అమలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. 30 రోజుల్లో 30 కీలకమైన నిర్ణయాలను తీసుకున్న ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తుందన్నారు. సమావేశంలో నయబ్ రసూల్, పెద కరీముల్లా, నందిగం ఆశీర్వాదం టీడీపీ నేతలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నాగార్జున యాదవ్‌పై ఫిర్యాదు

సత్తెనపల్లి రూరల్, జూలై 13 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ అధికార ప్రతినిధి మండలంలోని అబ్బూరు గ్రామానికి చెందిన ఎనుముల నాగార్జున యాదవ్‌పై కేసు నమోదు చేయాలని సత్తెనపల్లి మండల టీడీపీ నాయకులు శనివారం డీఎస్పీ గురునాథబాబుకు ఫిర్యాదు చేశారు. 2003 అలిపిరి ఘటనలో తప్పించుకొని చంద్రబాబునాయుడు బతికి పోయాడని, ఈసారి తప్పించుకోలేడని నాగార్జునయాదవ్ వ్యాఖ్యానించటంలో ఏదో కుట్రకోణం దాగి ఉందనే అనుమానం కలుగుతుందన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు చేసిన నాగార్జున యాదవ్‌పై తగు సెక్షన్‌ల పై కేసు నమోదు చేసి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆళ్ల అమరేశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ఎర్ర వెంకటేశ్వర్లు, తుమ్మల ఏడుకొండలు, కల్లా రమేష్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

మాచర్లరూరల్, జూలై 13: అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొత్తపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన దగ్గుల బ్రహ్మారెడ్డి (40) కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. శుక్రవారం పొలానికి వెళ్తున్నానని భార్య సుబ్బమ్మతో చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అనంతరం తిరిగి రాకపోవడంతో శనివారం కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా బ్రహ్మారెడ్డి పురుగుమందు తాగి మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని తండ్రి చిన పేరిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య సుబ్బమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పండ్ల తోటల సాగుకు ఆర్థిక ప్రోత్సాహం

నకరికల్లు, జూలై 13 : పండ్ల తోటలు, ఉద్యాన పంటలు, పూల తోటలు సాగుచేసే రైతులకు ఉపాధి హామీపథకం ద్వారా ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తుందని ఎంపీడీవో డీ.జయమణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు సంవత్సరాలకు గానూ మల్బరీ తోట సాగుకు రూ.36 వేలు, గులాబీ సాగుకు రూ.47,500, యాపిల్ బేర్ సాగుకు రూ.1.14 లక్షలు, మునగ సాగుకు రూ.23 వేలు వరకు ఆర్థిక ప్రోత్సాహకం అందుతుందన్నారు. ఆసక్తిగల సన్న, చిన్న కారు, ఎస్సీ, ఎస్టీ రైతులు తమ పట్టాదార్ పాసుపుస్తకం జిరాక్స్, ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లతో ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని జయమణి తెలిపారు.

సంగం డెయిరీ బోనస్‌లు పంపిణీ

కారంపూడి, జూలై 13: కారంపూడి మండలంలోని పెదకొదమగుండ్ల, చినకొదమగుండ్ల, గాదెవారిపల్లె, కారంపూడి గ్రామాల్లో సంగం డెయిరీ ఆధ్వర్యంలో 600 మంది రైతులకు రూ.9.71 లక్షల విలువైన బోనస్‌లు పంపిణీ చేశారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ షేలుకొరి శ్రీనివాసరావు, మేనేజర్ రంగారావు, సూపర్‌వైజర్ అంజిరెడ్డి, హనుమంతరావు, సంగం డెయిరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొహరం వేడుకలకు చావిడిలు సిద్ధం

మాచవరం, జూలై 13: మొహరం వేడుకలకు మండలంలోని పలు గ్రామాల పీర్లచావిడిలు సిద్ధమయ్యాయి. వేమవరం, మాచవరం, గంగిరెడ్డిపాలెం, రేగులగడ్డ, పిల్లుట్ల, మోర్జంపాడు, తదితర గ్రామాలలోని పీర్లచావిడిలు విద్యుద్దీపాలతో అలంకరించారు. శనివారం 7వ పరగనను పురస్కరించుకుని వేమవరం, గంగిరెడ్డిపాలెం గ్రామ పురవీధులలో పీర్లను ఊరేగింపు నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాలలోని ప్రజలు 7వ పరగన్‌ను పురస్కరించుకుని బెల్లం, వడపప్పుతో పీర్లచావిడి వద్దకు వెళ్లి కదిలించారు. దీంతో ఆయా గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది.

గంజాయిపై సమాచారమివ్వండి

సత్తెనపల్లిజూలై13: పట్టణంలో ఎవరైనా గంజాయి అమ్ముతున్నా, తాగుతున్నా ఆట్టివారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని పట్టణ సీఐ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. గంజాయి నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయిపై సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగటం చట్ట రీత్యా నేరమన్నారు. అలాంటి వారిపైనా చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

గురజాల టౌన్, జూలై 13: మండలంలోని చర్లగుడిపాడు గ్రామానికి చెందిన డేకొండ కృష్ణాచారి అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన అంబరాజు వద్ద డెకొరేషన్ పనులు చేస్తూ ఉన్నాడు. శనివారం గ్రామంలో జరిగే వివాహ వేడుకకు డెకొరేషన్‌లో భాగంగా లైటింగ్ పనులు చేస్తుండగా పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ తీగ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలపాలైన కృష్ణాచారిని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కృష్ణాచారిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తిరుమలకు జనసేన శ్రేణుల పాదయాత్ర

- జెండా ఊపి ప్రారంభించిన గుంటూరు మాజీ మేయర్ కన్నా

రాజుపాలెం, జూలై 13: ముక్కు బెల్లింపు కార్యక్రమంలో భాగంగా మండల జనసేన పార్టీ శ్రేణులు శనివారం తిరుపతి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ముందుగా వారు రాజుపాలెంలోని అంకమ్మతల్లి దేవాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి దేవరంపాడు నేతి వెంకన్నస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ కుమారుడు గుంటూరు మాజీమేయర్ కన్నా నాగరాజు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పాదయాత్రలో పాల్గొన్నవారందరు క్షేమంగా వెళ్లి తిరిగి రావాలని కోరారు. జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, శ్రీకృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణలు విజయం సాధించడంతో పాటు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేస్తే పాదయాత్రగా తిరుమలకు వస్తామని మొక్కుకున్నట్లు తెలిపారు. ఆమొక్కు చెల్లింపులో భాగంగా పాదయాత్రగా తిరుమలకు శ్రీకారం చుట్టామన్నారు. తిరుమల పాదయాత్రలో నరసయ్యతో పాటు కేదారి రమేష్, రుసుం వెంకటేశ్వర్లు, తోట వెంకటేశ్వర్లు, తలారి వెంకటేశ్వర్లు, తోట వెంకటశివరావు, హనుమంతురావు, పిడూరి వెంకటేశ్వర్లు, పల్లూరాయలు ఉన్నారు. అనంతరం ఇనిమెట్ల గ్రామస్థులు 25 మంది దేవరంపాడు శ్రీనేతి వెంకన్న స్వామి ఆలయం వరకు పాదయాత్రగా వచ్చి మొక్కు చెల్లించారు.



తిరుమలకు పాదయాత్రగా బయల్దేరినవారితో కన్నా నాగరాజు



పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్

మోడల్ స్కూల్లో దాహం.. దాహం..

- పనిచేయని వాటర్ ఫిల్టర్, మినరల్ వాటర్ ప్లాంట్
- తాగునీటికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు .. ఆందోళనలో తల్లిదండ్రులు

కారంపూడి, జూలై 13: స్థానిక ఏపీ మోడల్ స్కూల్లోని విద్యార్థులు దాహార్తితో అల్లాడిపోతున్నారు. సంవత్సర కాలంగా పాఠశాలలోని మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయక మూలనపడటంతో విద్యార్థుల గొంతు ఎండుతోంది. దీంతో ఎవరికి వారు ఇంటి వద్ద నుంచి వాటర్ బాటిల్ బ్యాగులో పెట్టుకుని రావాల్సిన దుస్థితి నెలకొంది. మధ్యలో బాటిల్‌లోని నీరు అయిపోతే తాగునీటి కోసం వెంపర్లాడాల్సిన పరిస్థితి నెలకొంది.

కారంపూడి పట్టణంలోని వినుకొండ రహదారిలో ఏపీ మోడల్ స్కూల్ భవనాన్ని లక్షల ఖర్చు పెట్టి నిర్మించారు. కానీ అందులో తాగు నీటి సౌకర్యం లేదు. కొంతమంది దాతలు సహకారంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అనంతర కాలంలో అది మరమ్మతులు గురైతే పట్టించుకునే వారు లేరు. ప్రస్తుతం పదో తరగతి వరకు 476 మంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు. జూనియర్ కాలేజీ కూడా ఉన్నందున ఇంటర్ వరకు మరో 100 మంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు. మరో 25 మంది స్టాఫ్ ఉన్నారు. మొత్తం 600 మంది పాఠశాలలో ఉంటున్నారు. అంత మందికి తాగునీటి సౌకర్యం లేకపోతే ఏ ఒక్క అధికారి, నేత పట్టించుకున్న పరిస్థితి లేదు. ఎల్లల తల్లిదండ్రులు గగ్గోలు పెట్టినా శుద్ధి అయిన నీరు అందించలేకపోతున్నారు. ప్రస్తుతం కారంపూడిలో డయేరియా వ్యాధి ప్రబలి ఉంది. ఇప్పుడిప్పుడే కుదుటపడుతుంది. మంచి నీటినే తాగాలని వైద్యులు సూచిస్తున్నా విద్యార్థులకు మంచి నీరు అందడం లేదు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి విద్యార్థులకు మంచినీరు అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి

బెల్లంకొండ, జూలై 13 : బెల్లంకొండ మండల అభివృద్ధికి సహకరించాలని మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత వెన్నా వెంకటరెడ్డి నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను కలిసి విన్నవించారు. శనివారం ఆయన నరసరావుపేట ఎంపీ కార్యాలయంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను మర్యాద పూర్వకంగా కలిశారు. బెల్లంకొండ మండలం వెనుకబడిన ప్రాంతమని, మండల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఎంపీ స్పందించి ఎంపీ నిధులతో మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వెంకటరెడ్డి తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో జడ్పీ హైస్కూలు విద్యార్థులకు సీట్లు

క్రోసూరు, జూలై13: మండలంలోని ఊటుకూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కే.ప్రకాశరావు తెలిపారు. 10వ తరగతిలో కట్టారెడ్డి మేఘనకు 585, గడేటి అశ్వనీకి 565 మార్కులు లభించి నట్లు ఆయన చెప్పారు. క్రోసూరు ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు చెందిన మరో ఇద్దరు విద్యార్థినిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మేరీ సుజన్ తెలియజేశారు. మౌలా జాస్మిన్ 570 మార్కులు, చంద్రిక 570 మార్కులు సాధించినట్లు ఆమె తెలియ జేశారు. ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థినిలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా

పూర్ణచంద్రరావు

పెదకూరపాడు, జూలై 13: జిల్లా తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శిగా పరుచూరి పూర్ణచంద్రరావును నియమిస్తూ టీడీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ నియామకపు పత్రాన్ని పూర్ణచంద్రరావుకు అందించారు. గుంటూరులోని కార్యాలయంలో శనివారం ఈ నియామకపు పత్రాన్ని పూర్ణచంద్రరావుకి అందిస్తూ రైతు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు రావాల్సిన బాధ్యత ఆయనపై ఉందని సూచించారు. మండలంలోని ముస్సాపురపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు తన నియామకానికి కృషి చేసిన జిల్లా పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్‌కు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులుకు, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అక్కిరాజు రమేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్, శంకరరావులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి ఏర్పాట్లపై పరిశీలన

మాచర్ల రూరల్, జూలై 13: మండలంలోని ఎత్తిపోతల రంగనాథస్వామి ఆలయంలో ఈనెల 17న నిర్వహించనున్న తొలి ఏకాదశి ఏర్పాట్లపై శనివారం తాళ్లపల్లి సర్పంచ్ బ్రహ్మానాయుడు ఈవో సాంబయ్యతో కలిసి పరిశీలించారు. భక్తులకు ఏటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పూజారులు దత్తు, కుమార్‌శర్మ, సుదర్శనాచార్యులు, గ్రామపెద్దలు బొట్టు సత్యనారాయణ, నాళం నాగేశ్వరరావు, జూకూరి సత్యం, సుబ్బారావు, బాణావత్ వెంకటేశ్వరనాయక్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాహితమే ధ్యేయంగా

చంద్రబాబు పాలన

- టీడీపీ నేతలు

క్రోసూరు, జూలై 13 : ప్రజాహితమే అభిమతంగా నెల రోజుల చంద్రబాబు పరిపాలన కొనసాగిందని నియోజకవర్గ టీడీపీ నేతలు తెలిపారు. శనివారం క్రోసూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు కొండ్రముట్ల నాగేశ్వరరావు, పిడూరి నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నలజాల సదాశివరావు మాట్లాడారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 5 సంతకాలతో సంక్షేమ పథకాలు అమలుని చంద్రబాబు ప్రారంభించారన్నారు. రాజధాని అభివృద్ధి, పోలవరం నిర్మాణం వంటి భారీ ప్రాజెక్టు పనులను ఉపయుక్తంగా చేశారన్నారు. జూలై 1న సుమారు 4వేల కోట్లరూపాయల పింఛన్లను పంపిణీచేసి ప్రజల విశ్వాసాన్ని పొందారన్నారు. సమావేశంలో పార్టీ నేతలు, తోక వెంకటరావు, దుద్దుల యోహాన్, మండల టీడీపీ అధ్యక్షుడు గుడిపూడి బాషా, మాజీ సొసైటీ అధ్యక్షులు నీలం రామారావు, తెలుగు యువత నాయకులు షేక్ సలాం, బయ్యారపు మైనర్ బాబు, అనుమాల పూర్ణ, దొడ్డ సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమరావతిలో చంద్రబాబు బయోపిక్ ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బయోపిక్ 'ధర్మ చక్ర' షూటింగ్‌ను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ క్లాప్ కొట్టి శనివారం ప్రారంభించారు. రాజధాని గ్రామం మల్కాపురం వి స్క్వేర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. పసుపులేటి వెంకట రమణ దర్శకత్వంలో మనోహర్ నాయుడు నిర్మిస్తున్నారు. పది రోజుల పాటు అమరావతిలో షూటింగ్ జరుగుతుంది. ఇందులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులు కూడా కళాకారులతో నటిస్తారు.

- తుళ్లూరు(ఆంధ్రజ్యోతి)

రూ. వెయ్యి కోట్ల క్లబ్‌లో కల్కి



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపే వసూళ్లతో దూసుకుపోతోంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా హిందీ బెల్ట్‌లో, విదేశాల్లోనూ సంచలన వసూళ్లను సాధిస్తోంది. తాజాగా 'కల్కి' చిత్రం కీర్తి కిరీటంలో మరో మైలురాయి చేరింది. ఈ చిత్రం రూ. వెయ్యి కోట్ల వసూళ్లను అందుకున్నట్లు నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ శనివారం తెలిపింది. విడుదలైన మూడు వారాల తర్వాత కూడా బాక్సాఫీసు దగ్గర నిలకడైన వసూళ్లతో కొనసాగుతున్నట్లు తెలిపింది. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనే, దిశాపటానీ కీలకపాత్రలు పోషించారు. సి. అశ్వనీదత్ నిర్మించారు.


మోసపోయా.. ఆత్మహత్య చేసుకుంటా




నటుడు రాజ్ తరుణ్, అతని ప్రియురాలు లావణ్య వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. రాజ్ తరుణ్ 11 ఏళ్లు తనతో సహజీవనం చేసి.. ఇప్పుడు మాల్వీ మల్హోత్రా అనే హీరోయిన్‌తో తిరుగుతూ తనను దూరం పెడుతున్నాడంటూ కేసు పెట్టిన లావణ్య.. శుక్రవారం రాత్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్టు తెలిసింది. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన న్యాయవాదికి వాట్సాప్ చాటింగ్‌లో చెప్పడం.. ఆయన 112కు ఫోన్ చేయడంతో నార్సింగ్ పోలీసులు వెంటనే ఆమె ఇంటికి చేరుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. తనకు రూ.5 కోట్లు ఇస్తామని, కేసు వెనక్కి తీసుకోవాలని కొందరు బెదిరిస్తున్నారని న్యాయవాదితో చాటింగ్‌లో ఆమె పేర్కొన్నారు. రాజ్ తరుణ్ చేతిలో దారుణంగా మోసపోయాయని, ప్రతిదీ ఓ పథకం ప్రకారం జరిగిందన్నారు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని, తన చావుకు రాజ్ తరుణ్, అతని తల్లిదండ్రులతో పాటు మాల్వీ మల్హోత్రా కారణమని పేర్కొన్నారు. లావణ్య శనివారం తన న్యాయవాదితో కలిసి నార్సింగ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరై రాజ్ తరుణ్‌తో తనకు ఉన్న సంబంధంపై పలు విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. నార్సింగ్ పోలీసులు పలు సెక్షన్ల కింద మాల్వ, మయాంక్, రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేశారు.


హైదరాబాద్ సిటీ/నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)











మెరుగైన సదుపాయాలు కల్పించడమే తక్షణ కర్తవ్యం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 13: ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే తన ముందున్న తక్షణ కర్తవ్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శనివారం నరసరావుపేట పట్టణంలోని ఆరో వార్డు పరిధిలోని బాబా పేట ఫ్లైఓవర్ కింద వర్షం నీరు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడటంపై అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణం, మరమ్మతుల్ని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ప్రజల అవస్థల్ని దృష్టిలో పెట్టుకొని చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం రోడ్లు మరమ్మతులకు నిదులు మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నానని ఆయన తెలిపారు.



బాబాపేట ఫ్లైఓవర్ కింద నిలిచిపోయిన వర్షం నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తక్కువ ధరలకే బియ్యం, కందిపప్పు సరఫరా

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, జూలై 13: ప్రభుత్వం పేదలకు తక్కువ ధరకు కందిపప్పు, నాణ్యమైన బియ్యం అందిస్తుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండ దాల్ అండ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పౌరసఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు కందిపప్పు, బియ్యం దుకాణాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకటో రకం కందిపప్పు కిలో రూ.160, బియ్యం కేజీ రూ.49, రెండో రకం బియ్యం రూ.48 అందిస్తున్నట్లు తెలిపారు. పేదలకు నిత్యావసర ధరలు అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో దాల్ అండ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కౌంటర్లు ఏర్పాటు చేసి పేదలకు తక్కువ ధరకు కందిపప్పు, బియ్యం అందిస్తామని తెలిపారు. వినుకొండలోనే కాకుండా మండల కేంద్రాల్లో సైతం కౌంటర్లు ఏర్పాటు చేయాలని మిల్లర్లకు సూచించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఊర బాస్కరరావు, వినుకొండ మిల్లర్స్ అధ్యక్షుడు మక్కెన ఆంజనేయులు, దాల్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు ఇమ్మడిశెట్టి నాగేశ్వరావు, పెండేల వెంకటపుల్లారావు, అధ్యక్షులు కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, అచ్చుత రామసుబ్బారావు, మేడం రమేష్, కార్యదర్శి పెండ్యేల వెంకటసురేష్, అన్నా సుందరావు, పరుచూరి ప్రకాశ్‌రావులతో పాటు టీడీపీ నాయకులు పీవీ సురేష్, ఇయూబ్ ఖాన్, గోల్డు కరీముల్ల, గుడివాడ గుర్నాదం. జనసేన. బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కందిపప్పు, బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ, మక్కెన

జీపీఎస్ పెన్షన్ పథకం అమలుకు ఎస్టీయూ ఖండన

చిలకలూరిపేట, జూలై 13: సీపీఎస్ స్థానంలో తీసుకు వచ్చిన జీపీఎస్ విధానాన్ని స్థానిక ఎస్టీయూ నేతలు శనివారం ఖండించారు. ఈ విధానం గత ఏడాది అక్టోబరు నుంచే అమల్లోకి తెస్తూ విడుదల చేసిన గెజిట్‌పై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నష్టం కలుగుతుందన్నారు. కొత్త ప్రభుత్వం విధి విధానాలు రూపొందించకుండా అకస్మాత్తుగా నోటిఫికేషన్ ఇవ్వటం ఎస్టీయూ నేతల సమావేశంలో ఆ సంఘం నాయకులు కే కోటేశ్వరరావు, పోటు శ్రీనివాసరావు, వినుకొండ అక్కయ్య, జమీర్ బాషా, మేకల కోటేశ్వర రావు, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో మొక్కలు నాటే కార్యక్రమం

చిలకలూరిపేట, జూలై 13: స్థానిక ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ ప్రభుత్వ ఆస్పత్రిలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్లబ్ కార్యదర్శి నార్నె జయలక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

టీపీవో ఎంవీ నరసింహారావు మృతి బాధాకరం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 13: నరసరావుపేట మున్సిపాలిటి టౌన్ ప్లానింగ్ అధికారి ఎంవీ నరసింహారావు శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. నరసింహారావు మృతికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తీవ్ర సంతాపం తెలియజేశారు.

ఘనంగా ఎంఏఎం ఫార్మసీ కళాశాల వార్షికోత్సం

నరసరావుపేట టౌన్, జూలై 13: ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో శనివారం 17వ యాన్యువల్ డే వేడుకలు, ఫేర్వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్నా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జనరల్ మేనేజర్ సీహెచ్ఏ రామారాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు జనరల్‌నాలెడ్జ్ కూడా పెంపొందించుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇంకా ఉన్నత చదువులు అభ్యసించి మంచి స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ప్రసాదరావు మాట్లాడుతూ ఈ ఏడాది కళాశాల నుంచి 60మందికి పైగా విద్యార్థులకు ఫార్మసీ కంపెనీలలో ఉన్నత ఉద్యోగావకాశాలను కల్పించామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఎఫ్ఆర్ సుందర్‌బాబు, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకటేశ్వర స్వామికి చందన అలంకారం

నరసరావుపేట అర్బన్, జూలై 13: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామిని శనివారం చందన అలంకారం చేశారు. అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారాహి నవ రాత్రుల సందర్భంగా స్వామికి ఐదున్నర కిలోల చందనంతో అలంకరణ చేశారు. ప్రతిరోజు సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలను నిర్వహిస్తున్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను అంద జేశారు.



చందన అలంకారంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి

వెల్లటూరు గిరిజన హాస్టల్‌లో బస

బొల్లాపల్లి, జూలై 13 : మండలంలోని వెల్లటూరు ప్రభుత్వ గిరిజన ఎస్టీ హాస్టల్‌లో శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎల్ వరలక్ష్మి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో పాటు భోజనం చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ భోజన వసతి తదితర వసతుల గురించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్‌లోని విద్యార్థులతో పాటే నిద్ర చేశారు. ఆమె వెంట హాస్టల్ వార్డెన్ దాక్షాయని బాయి తదితరులు ఉన్నారు.

నేడు పల్నాడు కల్చరల్ కార్నివాల్

నరసరావుపేట కల్చరల్, జూలై 13: నరసరావుపేట రంగస్థలి 44వ వార్షికోత్సవంలో భాగంగా నేడు పల్నాడు కల్చరల్ కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు రంగస్థలి కార్యవర్గ సభ్యులు శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్నివాల్ నందు పల్నాడు జిల్లా స్థాయిలో ఉన్నత, కళాశాల విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. స్థానిక భువనచంద్ర టౌన్ హాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే, పార్లమెంట్ సభ్యులు, ప్రముఖ రంగస్థల నటులు, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి పూర్వ అధ్యక్షుడు గుమ్మడి గోపాల కృష్ణ పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

కాకతీయ అన్నదాన సత్రానికి నూతన హంగులు

బొందిలిపాలెం(శావల్యాపురం), జూలై 13: మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయ ఆవరణలో ఉన్న కాకతీయ కమ్మవారి అన్నదాన సత్రానికి నూతన హంగులతో కూడిన మరమ్మతులు నిర్వహిస్తున్న వ్యవస్థాపక కమిటీసభ్యులు నాగుబడి వీరనారాయణ శనివారం తెలిపారు. అన్నదానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.5లక్షల వ్యయంతో సత్రం ముఖద్వారానికి ఆర్చీ నిర్మాణం, వాటర్ ట్యాంకు, వాటర్ పైప్‌లైన్లు తదితర పనులను చేపిస్తున్నామన్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి వచ్చే ఉగాదికి భక్తులకు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. సత్రం అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజావారధి పోస్టర్‌ను ఆవిష్కరించిన జనార్దన్

చిలకలూరిపేట, జూలై 13: నవతరం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి చేపట్టనున్న ప్రజావారధి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళగిరిలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం టీడీపీ రాజకీయ కార్యదర్శి టీడీ జనార్దన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కల్యాణ మండపం కార్యవర్గం ఎన్నిక

చిలకలూరిపేట, జూలై 13: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండప కమిటీ ఎన్నికలు శనివారం జరిగాయి. అధ్యక్షుడిగా డాక్టర్ అర్వపల్లి సురేష్, కార్యదర్శిగా చేవూరి కృష్ణమూర్తి, కోశాధికారిగా ముదయానూరు రాజీవ్ (డీవీసీ రాజవ్) ఎన్నికయ్యారు. కాగా కోశాధికారిగా ఎన్నికైన రాజీవ్ స్థానిక సీఆర్ క్లబ్‌లో టెన్నీస్ క్రీడాకారుడు కావటంతో ఆయనను క్రీడాకారులు శనివారం ఘనంగా సత్కరించారు.


మున్సిపాలిటీలో కమాండ్ కంట్రోల్‌రూం ఏర్పాటు

● కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి

నరసరావుపేట రూరల్, జూలై 13: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెట్లు విరగడం, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటున్న నేపథ్యంలో నరసరావుపేట మున్సిపాలిటీలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. నరసరావుపేట పుర పాలక సంఘం పరిధిలో శుక్రవారం రాత్రి కురిసినటువంటి భారీ వర్షానికి కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. ముఖ్యంగా ప్రకాష్‌నగర్ పరిసర ప్రాంతాల్లో రెండు మూడు చోట్ల చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వేకువ జామున శానిటేషన్ అధికారులు, సెక్రటరీలు వాటన్నింటిని తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మీ పరిసర ప్రాంతాల్లో చెట్లు గాని కరెంటు స్తంభాలు గానీ పడిపోవడం.. డ్రైనేజీ నీరు రోడ్డు మీదకి రావడం లాంటి సమస్యల పరిష్కారానికి పురపాలక సంఘం కార్యాలయం నందు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ ఫోన్ నెంబర్ :08647-222001, 9849907273, 7680905748కు కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.







కార్పొరేట్‌కు దీటుగా వంద పడకల ఆస్పత్రి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూలై 13 : కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా స్థానిక వంద పడకల ఆస్పత్రిని తీర్చిదిద్దుతామని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ల సహకారంతో పట్టణ ప్రజల వైద్య అవసరాలకు పెద్ద దిక్కుగా ఉన్న ఆస్పత్రిని త్వరలో సకల వసతులతో అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. శని వారం చిలకలూరిపేటలో వంద పడకల ఆస్పత్రిని పరిశీలించిన ప్రత్తిపాటి అన్ని విభాగాల్లోకి వెళ్లి రోగులకు అందుతున్న సేవలను, వసతుల గురించి విచారించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి ఆస్పత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేటలో టీడీపీ గత ప్రభుత్వ హయాంలో 18.57 కోట్ల నాబార్డు నిధులతో ఈ వంద పడకల ఆస్పత్రి నిర్మాణం ప్రారంభించామని, చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే పేదలు, పట్టణంలో ఎక్కువగా ఉండే దిగువ మధ్య తరగతి కోసమే ఈ ఆస్పత్రి మంజూరు చేయించి నిధులు తీసుకు వచ్చామన్నారు. కానీ వైసీపీ హయాంలో ప్రభుత్వ వైఫల్యం, చేతగాని తనంతో ఐదు సంవత్సరాలుగా పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఆస్పత్రి పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది పరికరాలు సమకూర్చక పోవటం దారుణమన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే విడదల రజిని ఆరోగ్యశాఖ మంత్రిగా ఉండి కూడా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికే వైద్య సిబ్బంది కొరత ఉంటే కొంత మందిని డిప్యుటేషన్‌పై పంపించారని, ఇవన్నీ చక్కదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. రక్త నిధి కేంద్రానికి కావాల్సిన మౌళిక వసతులు, మ్యాన్ పవర్ ఇవ్వాలన్నారు. జాతీయ రహదారి పక్కన ఉంది కాబట్టి ట్రామా కేర్ సెంటర్ ఉంటే ప్రమాదాల కేసులకు ఉపయోగ పడుతుందన్నారు. మార్చురీ బాక్స్ ఒకటే ఉందని, మరో రెండు కావాలని వైద్య సిబ్బంది అడిగారన్నారు. అంబులెన్స్, పోలీసు ఔట్ పోస్టు కూడా ఏర్పాటు చేయాలని సిబ్బంది కోరారన్నారు. ఇవన్నీ పరిశీలిస్తామని, ఆస్పత్రి ఉన్నతమైన ప్రాంతీయ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలంటే సరిపడా వైద్యులు, సిబ్బందితో పాటు వైద్య పరికరాలను సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ స్థానంలో ఎన్‌టీఆర్ వైద్యం తీసుకువచ్చామని, నెల రోజుల్లో ఆరోగ్య బీమా రానుందని, చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికి రూ.25 లక్షలతో ఆరోగ్య బీమా కూడా త్వరలో అందిస్తామన్నారు. ప్రతి పేదవాడు ధైర్యంగా వైద్యం పొందాలని, ఆర్థికంగా ఆలోచించే అవసరం లేకుండా ఉండాలని చంద్రబాబు ఆలోచనగా వివరించారు.

తిరుణాల ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, జూలై 13: వినుకొండ కొండపై ఉన్న రామలింగేశ్వర స్వామికి తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం చిన్నకొండపై చేస్తున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి శనివారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పరిశీలించారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కమిషనర్ కృష్ణవేణి, డీఈఈ వెంకయ్య ఆధ్వర్యంలో పనులు వేగంగా జరుగుతున్నాయని, కొండ మెట్ల వద్ద వేంచేసి ఉన్న శ్రీ వరసిద్ధ వినాయక స్వామి, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, దేవాలయాల నుంచి మెట్ల మార్గంలో చిన్న కొండ వరకు భక్తుల సౌకర్యార్థం అధికారులు అన్నీ ఏర్పాట్లు చెయ్యడం జరిగిందని, తాగు నీరు అన్న ప్రసాదాలు, మజ్జిగ, తదితర స్టాల్స్ ఏర్పాటుకు స్థలాలను ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. రామలింగేశ్వరస్వామి దేవాలయం నిర్మాణంలో ఉండడంవలన ఉత్సవ విగ్రహాలతో పూజా కార్యక్రమాలు జరుగుతుందని తెలిపారు. ఘాట్ రోడ్డులో భక్తుల సౌకర్యార్థం అన్నీ ఏర్పాట్లు చేయడం జరుగుతందని, ఆర్టీసీ అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేశారని తెలిపారు. తిరుణాల మహోత్సవాన్ని వైభవంగా జరిపేందుకు వివిధ శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. కుల మతాలకు అతీతంగా జరిగే తొలి ఏకాదశి కొండ పండుగను ప్రజలందరూ కలిసి విజయ వంతం చెయ్యాలని జి.వి కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీ.వి సురేష్, పువ్వాడ కృష్ణ, ఆయూబ్‌ఖాన్, గోల్డు కరిముల్లా, ల్యాబ్ శ్రీను, 10 వార్డు ఎలేజర్, గుడివాడ గుర్నాదం, దేవదాయ శాఖ ఈవో కొల్లి. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కలెక్టర్లకు అపూర్వ సత్కారం


కలెక్టర్ శివశంకర్‌ను గజమాలతో సత్కరిస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట కల్చరల్, జూలై. 13. గతంలో పల్నాడు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లుగా పనిచేసిన ప్రజా కలెక్టర్లకు శనివారం రాత్రి పల్నాడు బస్టాండ్ వద్ద గల కాసు కల్చరల్ సెంటర్ నందు పల్నాడు కళా క్షేత్రంలో పట్టణానికి చెందిన పలు సంస్థల నిర్వాహకులు అపూర్వ సత్కారం చేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌గా పని చేసి, ప్రస్తుతం వైఎస్సార్ కడప జిల్లా కలెక్టరగా బదిలీపై వెళ్లిన శివశంకర్ లోతేటిని, అలాగే పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేసి పదోన్నతిపై ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా వెళ్లిన ఎ.శ్యాంప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. సమావేశానికి కళాక్షేత్రం వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. సభకు హాజరైన పలువురు వక్తలు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ల సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీతలు పల్నాడు జిల్లాతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జిల్లా ప్రథమ కలెక్టర్‌గా పనిచేయడం తన అదృష్టమని అన్నారు. ఈ సందర్భంగా పలు సంస్థల నిర్వాహకులు, పలు శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు అధికారులను సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, ఆర్డీవో సరోజిని, నాగసరపు సుబ్బరాయ గుప్తా, డాక్టర్ నాగోతు ప్రకాష్, రాయల శ్రీనివాసరావు, పచ్చిపులుసు సతీష్, గంధ్రకోట మురళి తదితరులు పాల్గొన్నారు.

శివశంకర్‌కు రాజ్యాంగ ప్రతి అందజేత

చిలకలూరిపేట, జూలై 13 : పల్నాడు జిల్లా తొలి కలెక్టర్‌గా విశిష్టమైన సేవలు అందించి కడప జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లిన లోతేటి శివశంకర్‌కు శనివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా మోహన్ మాదిగ రాజ్యాంగ పుస్తకాన్ని అందజేశారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని శివశంకర్‌కు అభినందన తెలిపి పుస్తకాన్ని అందజేశారు.

డిగ్రీ పరీక్షా ఫలితాల్లో పీఎన్‌సీ అండ్ కేఆర్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, జూలై 13 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ పరీక్ష ఫలితాలలో పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జీ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మేదరమెట్ల ప్రేమ్‌చంద్, ట్రెజరర్ డాక్టర్ ఎం అన్నపూర్ణమ్మ, జాయింట్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పాలడుగు శ్రీనివాసప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

బహిరంగ ప్రకటన

బుడుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Atmakur బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన ... [illegible]

SCHEDULE

[illegible]

పోతుల వెంకటేశ్వరరావు, ఎమ్.ఏ., బి.యల్.,
అడ్వకేట్, రాఘవపాళెం, చిలకలూరిపేట. సెల్: 90484 21017

కార్ల షెడ్‌లో అగ్ని ప్రమాదం

వినుకొండ జూలై 13: పట్టణంలోని నర్సరావుపేట రోడ్డులో పున్నమి అపార్ట్‌మెంట్ సమీపంలోని కార్ల షెడ్‌లో ప్రమాదవ శాత్తు అగ్ని ప్రమాదం సంభవించి మారుతీ ఓమినీ కారు శనివారం దగ్ధమైంది. మంటలను గమనించిన స్థానికులు మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను ఆపివేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అంగన్‌వాడీకేంద్రాల మూసివేతపై చర్యలకు ఆదేశాలు

● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

రొంపిచర్ల, జూలై 13 : మండలంలోని మునమాక సెక్టార్ పరిధిలోని అలవాల, అచ్చయ్యపాలెం, తురుమెళ్ళ, వీరవట్నం, అన్నవరప్పాడు, సుబ్బయ్యపాలెం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి శనివారం తనిఖీ చేశారు. రెండు సెంటర్లు మినహా మిగిలిన అంగన్‌వాడీ కేంద్రాలు మూసివేసి ఉన్నట్లు గుర్తించారు. సూపర్‌వైజర్, సీడీపీవో తనిఖీలు నిర్వహించటం లేదని, అందువల్ల అంగన్‌వాడీ సెంటర్లు మూసి వేస్తున్నారని తెలిపారు. వారిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు.







ఉచిత కంటి వైద్యశిబిరం

వినుకొండటౌన్, జూలై 13: స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జన్మదినం సందర్భంగా శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపం నందు ఆదివారం పేదలకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు శివశక్తి మేనేజర్ జీవీ రమణ శనివారం తెలిపారు. మెగా వైద్య పరీక్షల శిబిరంలో భాగంగా శనివారం ఆయా గ్రామాల్లో 681 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 215 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరందరినీ శంకర్ కంటి ఆస్పత్రికి పంపి ఆపరేషన్ చేయిస్తారని ఫౌండేషన్ మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో శంకర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీ,కొడుకుపై హత్యాయత్నం

ఈపూరు, జూలై 13: భర్త పోయిన మహిళను మాయమాటలతో వశపరుచుకొని ఆమె గర్భం దాల్చడంతో చంపేందుకు ప్రయత్నించిన ఘటన మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలి లా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన భూపతి అనీల్ కుమార్‌శైలజా దంపతులు హైదరాబాద్‌లోని గచ్చిబౌలీలో కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. నాలుగు సంవత్సరాల కితం శైలజా భర్త అనీల్‌కుమార్ అనారోగ్యంతో మృతిచెందాడు. భర్త చనిపోవడంతో శైలజా తన కుమారుడు శివతో కలిసి అక్కడే ఉంటుంది. అదే సమయంలో పల్నాడు జిల్లా ఈపూరు మండలం ముప్పాళ్ళ గ్రామానికి చెందిన ముద్దా శ్రీనివాసరావు పనులు చేసుకుంటూ స్నేహితుల వద్ద ఉంటున్నాడు. ఆ సమయంలో శైలజాతో చనువుగా ఉంటూ సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో శైలజా గర్భం దాల్చింది. శైలజా తనను ఇంటికి తీసుకుపోవాలని ఒత్తిడి తీసుకురావడంతో శ్రీనివాసరావు ఆమెను చంపేందుకు ప్రణాళిక వేశాడు. ముందుగానే ముప్పాళ్ళ సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ సమీపంలో గొయ్యి తీసి ఉంచాడు. శుక్రవారం సాయంత్రం ఆస్పత్రికి వెళ్దామని చెప్పి ఆమెను కాలువ కట్ట వద్ద తీసిన గోతి వద్దకు తీసుకువచ్చి గొంతునులిమాడు. దాంతో శైలజా స్పృహ కోల్పోయింది. చనిపోయిందని అనుకొని రెస్టారెంట్‌లో ఉన్న ఆమె కొడుకు శివను కూడా తీసుకు వచ్చి చంపేందుకు ప్రయత్నించాడు. శ్రీనివాసరావు నుంచి శివ తప్పించుకొని వెళ్లి సమీపంలో ఉన్న పవర్ ప్లాంట్ వద్దకు వెళ్ళి జరిగిన విషయం చెప్పడంతో ప్లాంట్ సిబ్బంది పోలీసులకు ఫోన్ చేశారు. గ్రామస్థులు, పోలీసులు సిబ్బం ది అక్కడకు రావడంతో శ్రీనివాసరావు పరారయ్యాడు. సంఘటనాస్థలాన్ని వినుకొండ రూరల్ సీఐ యు సుధాకర్, ఎస్ఐ ఎస్కే మహమ్మద్ ఫిరోజ్ సందర్శించారు. శైలజా పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

